ఉచిత శిక్షణకు అడ్మిషన్లు ప్రారంభం

మామిడికుదురు: గెయిల్ ఆధ్వర్యంలో మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో ఈ ఏడాది రెండో విడత ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 18 నుంచి ప్రారంభమవుతాయని గెయిల్ ట్రైనీ సురేష్ శుక్రవారం తెలిపారు. ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు ఐటీఐ, ఇంటర్ చదివిన వారు అర్హులని చెప్పారు. నర్సింగ్ కోర్స్‌కి ఇంటర్, డిగ్రీ, పదో తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఔత్సాహికులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం మొబైల్ నంబర్ 8897999099 ను సంప్రదించాలన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు, పేకేరు గ్రామ వాస్తవ్యులు కర్రి వీణారెడ్డి గారి కుమారుడు మహేంద్ర సాయినాథ రెడ్డి నాకు ఇచ్చిన సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా

రావులపాలెం మండలం, కొమరాజులంక గ్రామ కాపురస్తురాలు కర్రి సూర్రెడ్డి గారి భార్య ఉదయ రత్నం గార్కి కొమరాజులంక గ్రామంలో రి.స.నెం.153/3 లో య.0-89 సెంట్లు భూమి.రి.స.నెం.74/15 లో య.0-10 సెంట్లు భూమి, రి.స.నెం.147/9 లో య.0-78 సెంట్లు భూమి, మరియు రి.స.నెం. 52లో 161.47 చ.గ. స్థలము అందలి డోరు నెం.1-84 రు గల ఆర్.సి.సి. బిల్డింగు, ఈతకోట గ్రామంలో రి.స.నెం.95/2లో య.0-69 సెంట్లు, రి.స నెం.62/5 లో య.0-08 1/2 సెంట్లు, రి.స.నెం .63/1 లో య.0-87 సెంట్లు భూమి కలదు. సదరు కర్రి ఉదయరత్నం గారు మంచి మనస్సుతోను, తెలివితేటలతోను కర్రి వీణారెడ్డి గారి మరియు ఉదయరత్నం గారి మరణాంతరం, నా క్లయింటుకు సదరు పైన తెలిపిన ఆస్తులు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించులాగున ఆఖరి వీలునామా వ్రాయించియున్నారు. కర్రి వీణారెడ్డి గారు మరియు ఉదయ రత్నం గారు మరణించియున్నందున సదరు యావత్తు ఆస్తికి మా క్లయింటు హక్కుదారుడై యున్నందున యావన్మందికి తెలియజేయడమైనది.

కావున సదరు ఆస్తులపై యితరులు ఎవ్వరు ఎటువంటి లావాదేవీలు జరిపినా అవి చెల్లనేరవని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు,
గుడిమెట్ల వీర్రెడ్డి,
అడ్వకేటు, సెల్ : 94406 07793

తుణుకు,
తేది :12-01-2024

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకే

- ఆడుదాం ఆంధ్ర రెండో విడత పోటీలు
- హోరాహోరీగా తలపడుతున్న జట్లు



అంబాజీపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

మామిడికుదురు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడల్లో భాగంగా శుక్రవారం రెండు విభాగాల్లో పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలుర క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. పాశర్లపూడిలంక ఓఎన్జీసీ గ్రౌండ్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. రాజోలు మండలం పొదలాడ ఇండోర్ స్టేడియంలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మండల పరిధిలోని 22 సచివాలయాలకు చెందిన జట్లు పాల్గొన్నాయని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ఐదు విభాగాల్లో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, పీడీలు పోటీలను పర్యవేక్షించారు.

కొత్తపేట: ఆడుదాం ఆంధ్రా రెండో దశ మండల స్థాయి క్రీడా పోటీలు మండలంలో ఉత్కంఠగా జరుగుతున్నాయి. ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి, పీడీలు, పీఈటీల ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలతో సంక్రాంతి పండగ వాతావరణం నెలకొంది. సచివాలయ స్థాయిలో విజేతలుగా నిలిచి మండల స్థాయిలో ఆడుతున్న క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి విజేతలుగా నిలవాలని ఏ టీమ్‌కు ఆ టీమ్ సభ్యులు ప్రత్యర్థి టీమ్‌లపై హోరాహోరీగా తలపడుతున్నారు.

అంబాజీపేట: గ్రామీణ క్రీడాకారుల్లో అణగారిపోతున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. మాచవరంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, పితాని శెట్టి, ఉందుర్తి నాగబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పొన్నమండ జట్టు విజయం

రాజోలు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా రాజోలు నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీల్లో పొన్నమండ క్రికెట్ జట్టు విజయం సాధించింది. ఈమేరకు శుక్రవారం రాజోలులో క్రీడాకారులను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. మూడు క్రికెట్ జట్లు మండల స్థాయికి ఎంపిక కాగా రెండు రోజుల పాటు క్రికెట్ పోటీలు ఎంతో ఆసక్తిగా జరిగాయి. పోటీల్లో విజయం సాధించిన పొన్నమండ జట్టు నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బందారు కాశీ, మండల ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, గ్రామశాఖ అధ్యక్షుడు కొప్పాడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆలమూరు ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐవీ శెట్టి పర్యవేక్షణలో శుక్రవారం జరిగిన బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో చెముడులంక-2 గ్రామ సచివాలయం జట్టు ప్రథమ స్థానం సాధించగా గుమ్మిలేరు గ్రామ సచివాలయం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో ఆలమూరు-1 జట్టు ప్రథమ, పెదపళ్ల గ్రామ సచివాలయం జట్టు ద్వితీయ స్థానాలను సాధించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు తదితరులు విజేతలను అభినందించారు.

సంప్రదాయం ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు

- 14 నుంచి 18 వరకు సంక్రాంతి, వేమన జయంతి సంబరాలు
- స్థానిక అక్షర థియేటర్లో ప్రోమోను తిలకించిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెం అక్షర థియేటర్‌లో ప్రోమో ప్రదర్శన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా సీఆర్‌సీ సంక్రాంతి, వేమన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అక్షర థియేటర్ స్క్రీన్-2లో ఈ ఉత్సవాలకు సంబంధించిన ప్రోమోను జగ్గిరెడ్డి, సీఆర్‌సీ సభ్యులతో కలసి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 14 నుంచి 18 వరకు స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్క్‌లో సీఆర్‌సీ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలు, వేమన జయంత్యుత్సవాలను సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు, హరిదాసు, జంగం దేవర, గంగిరెద్దులు, పిట్టలదొర తదితర వేషధారణలతో పాటు వివిధ వినోదాత్మక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి ఆహ్వానితులే అన్నారు. సంక్రాంతి పండగలో వీటిని తిలకించి మన సంస్కృతీ సంప్రదాయాలను ఇతర ప్రాంతాల వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సెక్రటరీ కర్రి అశోక్‌రెడ్డి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణకే సురక్ష



గుడిమెళ్లంకలో పేషెంట్లకు సురక్ష కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం గుడిమెళ్లంకలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పేషెంట్లకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ నల్లి విజయకుమారి, ఎంపీటీసీ నల్లి అంజలిదేవి, రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, నాయకులు పెన్మెత్స రంగరాజు, కె.అశోక్, చింతా రాజబాబు, ఆర్.వెంకట్, ఆరోగ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన అంకంరెడ్డి

మండలంలోని కత్తిమండ ఎమ్మెల్యే నివాసం వద్ద ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును శుక్రవారం రాష్ట్ర నవరత్నాలు కమిటీ చైర్మన్ అంకంరెడ్డి నాగనారాయణమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. వెంట రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య పాల్గొన్నారు.

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 302 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం జరిగింది. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత పలువురికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడి అరుణకుమారి, కొల్లాబత్తుల మధువాసన్, కుసుమ శ్రీధర్, కొప్పిశెట్టి హేమసుందర్, కడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రులో ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ బి.వరలక్ష్మి మాట్లాడుతూ పేద ప్రజలు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, కాంగ్రేగుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాయం అందించి ఆదుకుంటున్నారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలో ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.4 లక్షల సాయాన్ని చెక్కుల రూపంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ వద్ద అందజేశారు. సమావేశంలో విప్పర్తి మాట్లాడారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ దాసరి మౌనిక, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను సీఎం చేయడమే లక్ష్యం

అంబాజీపేట: త్వరలో జరిగే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు, పార్టీ విజయానికి అందరం కలసికట్టుగా పనిచేద్దామని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు, నాయకులకు తాను అండగా ఉంటానన్నారు. మాచవరానికి చెందిన బొంతు రామకృష్ణకు రూ.3.50 లక్షలు, చిరతపూడికి చెందిన లంకా మరియమ్మకు రూ.60 వేలు, వాకలగరువుకు చెందిన నవుంద్రు శ్యామలాదేవికి రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వేణుగోపాలరావు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్‌లు కోట బేబిరాణి, నాగాబత్తుల శాంతకుమారి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మామిడికుదురు: నమ్మిన వారికి న్యాయం చేసే వ్యక్తి సీఎం జగన్ అని, దానికి తానే ఉదాహరణ అని జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. మామిడికుదురు ఎంపీపీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆయన శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. సీఎం జగన్ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఇన్‌చార్జ్ పదవి తాను కోరుకోలేదని, తాను ఎవరికీ అడ్డు వెళ్లలేదన్నారు. పార్టీ అధిష్టానం తనపై బాధ్యత ఉంచిందన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు.

వైద్య రంగంలో విస్తరిస్తున్న రావులపాలెం

కొత్తపేట: కోనసీమ ముఖద్వారం రావులపాలెం ఇటీవల కొత్తపుంతలు తొక్కుతోంది. గత నాలుగున్నరేళ్ల వరకూ ఎవరికైనా పెద్ద జబ్బులు లేదా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడితే అంబులెన్సులు, కార్లలో ఎన్నో వ్యయప్రయాసలతో కాకినాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లవలసి వచ్చేది. ఇప్పుడు కోనసీమ ప్రాంత వాసులకు అందుబాటులో రావులపాలెంలో ఒక్కో వ్యాధికి ఒక్కో స్పెషలిస్టు రావడంతో పాటు అధునాతన వైద్యానికి ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. దాంతో ఉన్నత వైద్య సేవలు మెరుగయ్యాయి.

ఈ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యం

రావులపాలెంలో ప్రగతి నర్సింగ్‌హోమ్ లాప్రోస్కోపిక్ సర్జికల్ సెంటర్ అండ్ ప్రసూతి కేంద్రం ఉన్నత స్థాయిలో వైద్య సేవలు అందిస్తోంది. ప్రగతిలో శస్త్రచికిత్స నిపుణులు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కర్రి బలరామిరెడ్డి, ప్రసూతి, స్త్రీల వ్యాధుల, సంతాన సాఫల్య నిపుణులు డాక్టర్ కర్రి అనంతలక్ష్మి, కన్సల్టెంట్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కర్రి సందీప్‌రెడ్డి ఆయా విభాగాల్లో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే శ్రీరాఘవేంద్ర కంటి హాస్పిటల్ కంటి వైద్యంలో ఎంతో ఘన కీర్తి సాధించింది. ఐఓఎల్ అండ్ పాస్కో సర్జన్ డాక్టర్ గంధం రామారావు ఆధ్వర్యంలో డాక్టర్ యాళ్ల సాయికేశవ, డాక్టర్ గంధం పద్మప్రియాంక కంటి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల కంటి సమస్యల చికిత్సలు ప్రత్యేకత.

చిన్నారులకు అత్యాధునిక వైద్యం

అంబాజీపేట: చిన్న పిల్లల వైద్య విభాగంలో అత్యాధునిక ప్రమాణాలతో అంబాజీపేటలో సాయికృష్ణ తల్లీపిల్లల ఆసుపత్రి మెరుగైన వైద్య సేవలు అందిస్తుంది. విజయవాడ రెయిన్‌బో ఆస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలందించి పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ చెల్లుబోయిన వెంకటేష్, స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వీరవెల్లి వెంకట శైలజలు నిరుపేదలకు అతి తక్కువ ఫీజుకే 24 గంటలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఇరుసుమండ దీవెన ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజీ, కార్డియాలజీ, పల్మనాలజీ, గైనకాలజీ, నెఫ్రాలజీ, పీడియాట్రిక్స్‌కు సంబంధించి డాక్టర్ ఎ.విజయరాజు వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుతున్నాయి.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

పి.గన్నవరం: ఇటీవల ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు స్థానిక సీహెచ్‌సీలో వైద్యంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన వైద్యురాలి పై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు.